# కన్నీటి సాగు

- ఎండిపోయిన కూరగాయలు
- పశువుల మేతకు వదిలేసిన రైతులు



హన్వాడ, ఏప్రిల్ 2 : యాసంగి పంటల సాగు రైతులకు కన్నీళ్లను మిగుల్చుతున్నది. ఓవైపు కరెంట్ సమస్యలు.. మరోవైపు సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో ప్రస్తుతం చేతికొచ్చిన వరి, ఇతర పంటలు ఎండిపోతుండగా.. ప్రస్తుతం కూరగాయల తోటలు సైతం దెబ్బతింటున్నాయి. హన్వాడ మండలంలో పెద్ద ఎత్తున రైతులు కూరగాయలు సాగు చేస్తుంటారు. అయితే ఈసారి సాగునీళ్లు అందక చివరి దశలో ఉన్న పంటలు చేతికందే పరిస్థితులు లేవు. హన్వాడ శివారులో రైతు యాదయ్యకు చెందిన టమాట, వంకాయ పంటల ఎండిపోవడంతో మూగజీవాల మేతకు వదిలేశాడు. అలాగే బీరకాయ కాయలు పట్టే ముందు నీళ్లు అందని పరిస్థితి. ఇలా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెట్టుబడులకు వేలకు వేలు అప్పులు తెచ్చి పెడితే చేతికొచ్చిన పంట కండ్ల ఎదుటే ఎండిపోతుంటే గుండె చెరువవుతున్నదని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



హన్వాడ శివారులో యాదయ్య టమాట తోట ఎండిపోగా మేస్తున్న పశువులు





మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రేషన్ దుకాణాలు మూసి ఉంచడంతో నిరాశగా వెనుదిరిగి వెళ్తున్న కార్డుదారులు

# కార్డుల్లో కోత

- నెల రోజులకే 39,435 రేషన్ కార్డుల తొలగింపు
- సన్నబియ్యం పంపిణీలో లబ్ధిదారులకు తప్పని ఎదురు చూపులు
- మొదటి రోజు సాయంత్రం 4గంటల వరకు జరిగిన పంపిణీ 14 శాతమే

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 2 : ఓ వైపు ఆహార భద్రత కార్డులు జారీ కాక వేలాది కుటుంబాలు ఎదురు చూస్తుండగా.. మరో వైపు ఇప్పటికే కార్డులు ఉండి పుట్టిన పిల్లల పేర్లు నమోదు కావడం లేదని ఆవేదన చెందుతున్నవారు ఉన్నారు. నమోదు కోసం మండల, రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో అండగా ఉండాల్సిన ప్రజా పాలన ప్రభుత్వం నెల రోజుల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లాలో 39,435 కార్డులు తొలగించడంతో పాలమూరు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొత్త కార్డులు జారీ చేస్తున్నాం.. సన్నబియ్యం పంపిణీ చేపడుతున్నామని చెబుతూనే.. ఉన్న కార్డుల్లో కోత కొస్తుండటం కొసమెరుపు.

***కార్డుల్లో కోత ఇలా..***

మహబూబ్‌నగర్ జిల్లాలో గత నెల (మార్చి)లో మొత్తం కార్డులు 2,53,229 ఉండగా ఈ నెల (ఏప్రిల్)లో మొత్తం కార్డుల సంఖ్య 2,44,578కు చేరింది. ఈ లెక్కన 8,651 కార్డులు తొలగించారు. జోగుళాంబ-గద్వాల జిల్లాలో మార్చిలో 1,73,183 కార్డులు ఉండగా ఈ నెలలో కోటా కేటాయించిన కార్డులు 1,63,693 అంటే 9490 కార్డులకు కోత పెట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మార్చిలో 2,52,765 కార్డులు ఉండగా ప్రస్తుతం ఉన్న కార్డుల సంఖ్య 2,43,107. ఈ లెక్కన 9,658 కార్డులు తొలగించారు. నారాయణపేట జిల్లాలో మార్చి నెల కోటా కింద 1,52,323 కార్డులకు బియ్యం కేటాయించగా ఏప్రిల్‌కు గానూ 1,44,472 కార్డులకే కేటాయింపు ఇచ్చారంటే 7851 కార్డులు తొలగించారు. వనపర్తి జిల్లాలో మార్చిలో 1,63,138 కార్డులు ఉండగా ఈ నెల కోటా కింద 1,59,353 మాత్రమే కేటాయించారు. ఇలా మొత్తం ఉమ్మడి పాలమూరులోని 5జిల్లాల్లో మొత్తం కార్డులు 39,435 తొలగించారు.

***లక్షల్లో దరఖాస్తులు పెండింగ్..***

గతేడాది నవంబర్‌లో నిర్వహించిన కుల గణనలో, ఈ ఏడాది జనవరిలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం లక్షల్లో దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు అప్పట్లో ప్రకటించారు. ఇదిలా ఉండగా.. కొత్తగా కార్డులు జారీ చేయాల్సిన ప్రభుత్వం ఉన్నకార్డులు తొలగిస్తుండటం దారుణమని నిరుపేదలు వాపోతున్నారు. ఇప్పటికే అనేక మంది తమ కుటుంబ సభ్యుల పేర్లు కార్డుల్లో చేర్చాలంటూ.. కొత్త కార్డులు జారీ చేయాలంటూ దరఖాస్తులు సమర్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపడుతున్నట్లు ప్రకటించినా.. ఓ వైపు కోతలతో వాతలు పెడుతుండడంతో ఎటూపాలుపోని దుస్థితిలో పేదలు కొట్టుమిట్టాడుతున్నారు.

***ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తేనే పొట్టనిండేది..***

ఉమ్మడి పాలమూరులో సన్నబియ్యం పంపిణీ ప్రహసనంగా మారింది. ఇప్పటికే రెండు రోజులు గడుస్తున్నా.. చౌకధర దుకాణాలు పూర్తి స్థాయిలో తెరవకపోవడంతో పేదలు ఆకలితో అలమటిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కేంద్ర బింధువు అయిన మహబూబ్‌నగర్ జిల్లాలోనే మొదటి రోజు పూర్తిస్థాయిలో సన్నబియ్యం పంపిణీ జరగలేదంటే అతిశయోక్తి కాదు. చాలా వరకు ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తేనే.. డీలర్లు ప్రజా పంపిణీ చేపడుతున్నారు. మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలో మొదటి రోజు అనేక దుకాణాలు తెరుచుకోలేదు. ఇదేమని కార్డుదారులు ప్రశ్నిస్తే ఎమ్మెల్యే ప్రారంభించాక.. పంపిణీ చేపడతామని పలువురు డీలర్లు సమాధానం ఇచ్చారు.

***సన్నబియ్యం మొదటి రోజు 14శాతమే..***

సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా చౌకధర దుకాణాల్లో మొదటి రోజు కేవలం 14శాతం మాత్రమే లావాదేవీలు జరిగాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2037 చౌకధర దుకాణాలు ఉండగా.. బుధవారం సాయంత్రం 4గంటల వరకు కేవలం 285 దుకాణాల్లో మాత్రమే సన్న బియ్యం పంపిణీ చేపట్టారు. ఆయా దుకాణాల్లో మాత్రమే లావాదేవీలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 506 చౌకధర దుకాణాలు ఉండగా కేవలం 187 దుకాణాల్లో మాత్రమే లావాదేవీలు జరిగాయి.

***దొడ్డుబియ్యం బ్యాక్‌లాగ్ స్టాక్ ఎవరి బాధ్యత..***

గత నెల వరకు రేషన్ దుకాణాలకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యంలో కొంత బ్యాక్‌లాగ్ స్టాక్ మిగిలింది. ఈ నెల నుంచి సన్నబియ్యం ఇవ్వనుడటంతో ప్రతి షాపునకు ఫుల్ అలైన్‌మెంట్ ఇచ్చారు. బ్యాక్‌లాగ్ ఉన్న దొడ్డు బియ్యాన్ని తీసుకెళ్లలేదు. ఈ బియ్యానికి మీదే బాధ్యత అంటూ డీలర్లపైనే ఆ భారం పెట్టేశారు. కొత్త బియ్యం స్టాక్ దించినప్పుడు పాత బియ్యాన్ని తిరిగి తీసుకెళ్లాల్సి ఉండగా.. చాలా చోట్ల ఆ బియ్యాన్ని తిరిగి తీసుకెళ్లలేదు. చాలా వరకు షాపులను అద్దెకు తీసుకుని నడిపిస్తున్నామని, పాత స్టాక్‌కు సెక్యూరిటీ ఇచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఈ విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

***వందశాతం పంపిణీ చేస్తున్నాం..***

జిల్లావ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. వందశాతం దుకాణాల్లో పంపిణీ చేపడుతున్నాం. దొడ్డు బియ్యం బ్యాక్‌లాగ్ డీలర్లకు భద్రపర్చమని చెప్పాం. త్వరలో వాటిని క్లియర్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. ముందు సన్న బియ్యం కార్డుదారులకు అందించాలని సూచించాం.

– వెంకటేశ్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి, మహబూబ్‌నగర్



# షాపుల వద్ద.. పేదల ఎదురుచూపులు

- ఎమ్మెల్యే ప్రారంభించాకే షాపులు తెరవాలని తాసీల్దార్ల ఆదేశాలు
- సోషల్ మీడియాలో వార్తలు రావడంతో సన్న బియ్యం పంపిణీ

అమరచింత, ఏప్రిల్ 2 : రేషన్‌కార్డులు ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించి ఉగాది రోజు సీఎం రేవంత్‌రెడ్డి హుజురాబాద్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల కేంద్రాల్లోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ప్రారంభం చేసిన తర్వాతనే మిగిలిన డీలర్లు తమ రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని ఆత్మకూర్, అమరచింత మండలాల తాసీల్దార్లు రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చాలా వరకు రేషన్ షాపులు తెరవక పోగా కొన్ని చోట్లా తెరిచినా వెంటనే సంబంధిత డీలర్లు తాసీల్దార్ ఆదేశాలు సూచించడంతో మూసి వేశారు. కానీ రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం కోసం చాలా చోట్ల రేషన్ బియ్యం కోసం షాపుల ముందు పడిగాపులు కాశారు. సంబంధిత డీలర్లను అడిగితే ఎమ్మెల్యే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన తర్వాతే బియ్యం ఇస్తామని చెప్పడంతో ఎమ్మెల్యే ప్రారంభించే వరకు మేము ఉపవాసం ఉండాలంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అమరచింత తాసీల్దార్ రవికుమార్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో శ్రీకృష్ణనగర్‌లోని రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఆత్మకూర్ మండలంలోని పలు గ్రామాలకు స్టాక్ పాయింట్ నుంచి రేషన్‌షాప్‌లకు సన్నబియ్యం రాలేదు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఖానాపూర్‌లో రేషన్ షాపులో తాసీల్దార్ షేక్‌చాంద్‌పాషా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బియ్యం పంపిణీని ప్రారంభించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్సీ

మద్దూర్, ఏప్రిల్ 2 : మద్దూర్ మండలం దమగ్నా పూర్ గ్రామానికి చెందిన బోయిని హన్మంతుకు బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి రూ.50 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు గోపాల్, దమగ్నా పూర్ మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి

# బీఆర్ఎస్‌లోనే కొనసాగుతాం

- కేటీదొడ్డి ఎంపీపీ మనోరమ్మ

గద్వాల అర్బన్, ఏప్రిల్ 2 : మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నాం.. కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తు పార్టీ పూర్వవైభవం తీసుకువస్తాం అని కేటీదొడ్డి మండల మాజీ ఎంపీపీ మనోరమ పేర్కొన్నారు. బుధవారం కేటీదొడ్డి మండలం పరిధిలోని గంగన్‌పల్లి గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాసు హన్మంతు నాయుడు, బాసు శ్యామల హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మనోరమ మాట్లాడుతూ మేము కేసీఆర్ నిర్మించిన పార్టీలోనే ఉంటాం.. ఎవరు ఎక్కడికి పోయినా సరే మేము ఈ పార్టీలోనే కొనసాగుతామని, గద్వాల నియోజకవర్గంలో మరోమారు గులాబీ జెండా ఎగిరేవిధంగా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మోనేశ్, రాము, వెంకటేశ్, శేఖర్ నాయుడు, రాజు, శ్రీరాములు తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ నాయకులతో మాజీ ఎంపీపీ మనోరమ

# ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

వడ్డేపల్లి, ఏప్రిల్ 2 : శాంతినగర్‌కు చెందిన డాక్టర్ బి.సత్యప్రకాశ్‌కు ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. ఆసియా, ఆఫ్రికా ఖండాలను చూడకుండా అతి తక్కువ సమయంలో వాటి వివరాలు చెప్పినందుకు ఈ పురస్కారం లభించింది. 2021లో ప్రమాదవశావత్తు సత్యప్రకాశ్ కుడికాలు పోగొట్టుకున్నాడు. అయినప్పటికీ కుంగిపోకుండా ఇంటర్నేషల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం పొందాడు. ఈ మేరకు ఐపీఏసీ సంస్థ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.



సత్యప్రకాశ్

# బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన




వనపర్తిలో కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు హేమంత్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రజా పాలన పేరుతో హైదరాబాద్ క్యాంపస్ 400 ఎకరాల బయోడైవర్సిటీ స్థలాన్ని బుల్డోజర్లతో మట్టికరిపిస్తున్నారని, విద్యార్థులపై లాఠీచార్జీ చేస్తూ రౌడీ రాజ్యం చేస్తున్నారని, మానవత్వాన్ని మరిచి ప్రకృతిని వినాశనం చేస్తున్నారని, దీనిని అడ్డుకుంటున్న విద్యార్థులను అరెస్టు చేయడం, లాఠీచార్జి చేయడం కేసులు బనాయించడం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే హెచ్‌సీయూలో పోలీసు శిబిరాన్ని తొలగించి భూముల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు వాకిటి శ్రీధర్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, అశోక్, బీఆర్ఎస్వీ నాయకులు జోహేబ్, సాయి, భాగ్యరాజు, భాను యాదవ్, అఖిలేందర్, నాగరాజు, విశాల్, రాకేశ్, గంగప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, చిట్యాల రాము, మంద రాము, సుబ్బు, ముని, శ్యాం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# లాఠీచార్జి ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 2 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడుకోవడానికి పోరాటం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం ప్రభుత్వ చేతిగానితనాన్ని, అణచివేత ధోరణికి నిదర్శనం అని పాలమూరు యూనివర్సిటీ ఏబీవీపీ నాయకులు అన్నారు. బుధవారం పీయూ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీయూ ఏబీవీపీ అధ్యక్షుడు నగేశ్, యూనివర్సిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సంగీత, సౌమ్య తదితరులు మాట్లాడారు. అంతకు ముందు తరగతులు బహిష్కరించి హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరిట రాష్ట్రానికే తలమానికమైన హెచ్‌సీయూను భూములను కొల్లగొట్టడం సరికాదన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తుండగా మూడు, నాలుగు నెలల కోసారి రాష్ట్రంలోని ఏదో ఒక యూనివర్సిటీ భూములను అమ్ముతూ.. ఉన్నత విద్యావ్యవస్థలను భావితరాల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంలోకి నెట్టివేస్తోందన్నారు. పైసల కోసం పైశాచిక ఆనందం కోసం ప్రకృతిని క్షోభకు గురిచేస్తూ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగిస్తోందన్నారు. యూనివర్సిటీ భూములను అమ్మాలనే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలనను ఎండగడుతూ నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఓంప్రకాశ్, విష్ణు, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ సతీష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రవికుమార్, వేణు, నందిని, శివ, సతీశ్, భాను, కేశవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




తరగతులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

# ఆలయంలో అక్రమాలపై అడిషనల్ కమిషనర్ విచారణ

అలంపూర్, ఏప్రిల్ 2 : అలంపూర్ ఆలయాలపై, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మపై కొంతకాలంగా సోషల్ మీడియా, దిన పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వస్తున్న ఆరోపణలపై రాష్ట్ర దేవాదాయ శాఖ, దర్మాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి బుధవారం విచారణ చేపట్టారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆనంద్‌శర్మపై వచ్చిన ఫిర్యాదులతో పాటు స్థానిక ఎమ్మెల్యే విజయుడు చేసిన ఫిర్యాదులపై క్షుణ్ణంగా విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఫిర్యాదుదారులను ఒక్కొక్కరిని విడివిడిగా విచారణ చేశామన్నారు. ఫిర్యాదుదారుల నుంచి మౌకిక, లిఖిత పూర్వక సమాధానాలు స్వీకరించామన్నారు. ఆరోపణలపై వచ్చిన వివరణలన్నింటినీ కమిషనర్‌కు రెండు రోజుల్లో అందజేస్తామన్నారు. వారంలోపు కమిషనర్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. విచారణలో ఏసీ మధునేశ్వర్‌రెడ్డి, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కృష్ణవేణి

## ఈతకు వెళ్లి ముగ్గురు మృతి

రాజోళి, ఏప్రిల్ 2 : రాజోళి మండల సరిహద్దులో ఉన్న సుంకేసుల డ్యాంలో ఈతకు వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన సులేమాన్ (47) తన కుటుంబ సభ్యులతో కలిసి సుంకేసుల డ్యాం సందర్శించేందుకు వచ్చారు. తన కుమారులు ఫర్హాన్(11) ఫైజాన్ (9) నీళ్ల మునిగిపోగా కాపాడేందుకు తండ్రి సులేమాన్ వెళ్లగా తండ్రితో పాటు ఇద్దరు కొడుకులు మృతి చెందినట్లు తెలిపారు. వారి మృతదేహాలను కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు సమాచారం.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి

మద్దూరు, ఏప్రిల్ 2 : చిన్నారి ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడిన సంఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మద్దూరు మండలం దమగ్నా పూర్‌కు చెందిన మహిపాల్ కుమారుడు మానస్ (4) బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడ్డాడు. గమనించిన చిన్నారి తల్లి, నాయనమ్మ వెంటనే అతడిని సంపులోంచి బయటు తీసి మద్దూరు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

# గురుకుల భవనంపై నుంచి దూకిన విద్యార్థి

- నిమ్స్ దవాఖానకు తరలింపు

దేవరకద్ర, ఏప్రిల్ 2 : గురుకుల పాఠశాల భవనం పైనుంచి విద్యార్థి కిందికి దూకిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కథనం మేరకు.. దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి గ్రామ సమీపంలోని స్విట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన శ్రవణ్ 6వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో గదిలో ఎవరికీ చెప్పకుండా పాఠశాల భవనంపైకి వెళ్లాడు. విద్యార్థి లేడని వార్డెన్ గ్రహించి ఆరుబయట పరిశీలిస్తుండగా విద్యార్థి పాఠశాల వెనుక భాగంలో కిందపడి ఉండడాన్ని గ్రహించి ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించగా.. వెంటనే జిల్లా దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించగా.. వైద్య సేవలు అందించడంతో పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఆదేశాల మేరకు బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మంజోనల్ అధికారి రాణి, జిల్లా వెల్ఫేర్ అధికారి వాణిశ్రీ, తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు గురుకులానికి వెళ్లి పరిశీలించారు. వివరాల నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# ముగ్గురు సీనియర్ విద్యార్థులపై వేటు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 2 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ముగ్గురు సీనియర్ విద్యార్థులు ఓ జూనియర్ విద్యార్థిపై ర్యాగింగ్‌కు పాల్పడిన ఘటనలో సీనియర్లపై వేటుపడింది. ముగ్గురు సీనియర్లకు ఒకటి, రెండు, మూడు నెలలపాటు కళాశాలతోపాటు, హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. గతనెల 25వ తేదీన కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై సీనియర్లు లోకేశ్, హర్షవర్ధన్, హిమవర్ధన్ ర్యాగింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. మొదటి సంవత్సరం విద్యార్థిని గోడకుర్చీ వేయించడం, లేని సిలిండర్‌ను ఉన్నట్లుగా మోసినట్లు చూపించాలని టాస్క్ పెట్టారు. తాము పెట్టిన టాస్క్‌ను సక్రమంగా చేయలేదంటూ లెదర్ బెల్ట్‌తోను కాళ్లపై కొట్టారు. ఇంతటితో ఆగకుండా సదరు జూనియర్ ఫోన్ నుంచి ఫొటోలు షేర్ చేసుకొని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల కమిటీ, పోలీసులు, జూనియర్ విద్యార్థితో యాంటీ ర్యాగింగ్ టీమ్ బేటీ అయ్యింది. జూనియర్ విద్యార్థిపై చేసిన ర్యాగింగ్‌ను ఒక్కొక్కటిగా తెలుసుకుంటూ సీనియర్లపై చర్యలు తీసుకున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురిలో లోకేశ్‌కు 3నెలలు, హర్షవర్ధన్‌కు రెండు నెలలు, హిమవర్ధన్ అనే విద్యార్థిని ఒక నెలపాటు కళాశాలతో పాటు, హాస్టల్ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు.

# దొంగనోట్ల కలకలం

- వెలుగులోకి రూ.500 కరెన్సీ

అయిజ, ఏప్రిల్ 2 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో దొంగ నోట్ల కలకలం మొదలైంది. పట్టణంలోని వ్యాపారులకు పలువురు దొంగ నోట్లను అంటగడుతుండగా. తీరా పరిశీలించి లబోదిబోమంటున్నారు. రద్దీగా ఉండే మద్యం దుకాణాలు, పెద్దపెద్ద కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లో వీటిని చెలామణి చేస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం అయిజలోని ఓ దుకాణంలో దొంగ నోటు వెలుగులోకి వచ్చింది. దీంతో వ్యాపారి నోటును క్షుణ్ణంగా పరిశీలించి, దొంగనోటుగా నిర్ధారించుకొని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. కొందరు వ్యక్తులు దొంగనోట్లు చెలామణి చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న అయిజలో సమీప రాష్ట్రాలైన కర్ణాటక, ఏపీ నుంచి కొందరు వీటిని తెచ్చి చెలామణి చేస్తున్నారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో రూ.500 దొంగనోటు, అసలు నోటు తేడాలో లోపాలు

# హమ్మయ్యా.. పరీక్షలు ముగిశాయోచ్..

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 2 : పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్ద కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. మార్చి 21 నుంచి ప్రారంభమైన పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 45,574 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు 235 పరీక్షా కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాలో 60 పరీక్షా కేంద్రాల్లో జరిగిన సాంఘికశాస్త్రం పేపర్‌కు 37 మంది మాత్రమే గైర్హాజరు అయ్యారు. మొత్తం 12,776 మంది విద్యార్థులకు గానూ 12739 మంది పరీక్ష రాయగా 99.71శాతం నమోదైంది. నారాయణపేట జిల్లాలో 39 పరీక్షా కేంద్రాల్లో 7,635 మంది విద్యార్థులకు గానూ 7,617 పరీక్ష రాయగా 18 మంది గైర్హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 60 పరీక్షా కేంద్రాలు 10555 విద్యార్థులకు గానూ 10529 మంది పరీక్షలు రాయగా 26 మంది గైర్హాజరయ్యారు. వనపర్తి జిల్లాలో 36 పరీక్షా కేంద్రాల్లో 6853 మంది విద్యార్థులకు గానూ 68 40 మంది పరీక్షలు రాయగా 13 మంది గైర్హాజరయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 40 పరీక్షా కేంద్రాల్లో 7600 మంది విద్యార్థులకు 7567 మంది పరీక్ష రాయగా 33 మంది గైర్హాజరయ్యారు.

